ముమ్మరంగా మాసూళ్లు

- ఆశాజనకంగా రబీ వరిసాగు
- పంట కోత ప్రయోగాల్లో 60 బస్తాల దిగుబడి
- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ప్రభుత్వం


ఏడిద సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేటలో ధాన్యాన్ని బస్తాల్లోకి పోస్తున్న రైతులు

మండపేట: రబీ వరిసాగు ఆశాజనకంగా ఉంది. పంట కోతలు, మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తూర్పు డెల్టాలోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రబీ తుది దశ పనులు జోరందుకున్నాయి. ఎక్కడ చూసిన మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంటకోత ప్రయోగాల్లో ఎకరాకు 55 నుంచి 60 బస్తాలు వరకు దిగుబడి రావడం రైతులకు ఊరటనిస్తోంది. ఫలసాయం చేతికందుతున్న సమయంలో దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోంది.

92,862 ఎకరాల్లో సాగు

డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో దాదాపు 92,862 ఎకరాల్లో రైతులు రబీ సాగుచేశారు. అధిక శాతం విస్తీర్ణంలో ఎంటీయూ 1121, ఎంటీయూ 3626 రకాలను సాగు చేయగా కొద్ది విస్తీర్ణంలో ఆర్‌పీ ఆర్ 15048, తొలకరి పంటకు విత్తనాల కోసం స్వర్ణ రకం వంగడాలను సాగు చేశారు. జిల్లాలోని మిగిలిన ప్రాంతాల కన్నా నియోజకవర్గంలో ముందుగానే రైతులు రబీ సాగు చేయడంతో పంట తుది దశకు చేరుకుంది. వారం రోజుల క్రితమే దాళ్వా కోతలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల క్రితం చోటు చేసుకున్న మార్పులు రైతులను ఆందోళనకు గురి చేశాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో పనులు జోరందుకున్నాయి. ఇప్పటి వరకు నియోజకవర్గం వ్యాప్తంగా సుమారు 30 శాతం కోతలు పూర్తయినట్టు అంచనా. వరికోత యంత్రాల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. మరో వారం పది రోజుల్లో చాలా వరకు పనులు పూర్తవుతాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు 60 బస్తాల వరకూ దిగుబడి

సాగునీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం తీసుకున్న చర్యలు, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో రబీ పంట ఆశాజనకంగా ఉంది. పంట దిగుబడుల అంచనాకు వ్యవసాయాధికారులు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి నాలుగు చోట్ల ఈ ప్రయోగాలు జరుగుతున్నాయి. వీటి ఆధారంగా ఎకరాకు 60 బస్తాలు వరకు దిగుబడి వస్తున్నట్టు వ్యవసాయాధికారులు అంటున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఈ సీజన్‌లో సుమారు 3.4 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. కష్టం దళారుల పాలవకుండా అన్నదాతలకు అండగా డివిజన్‌లోని రెండు నియోజకవర్గ పరిధిలో దాదాపు 131 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ఏ ఇబ్బంది కలుగకుండా పూర్తి పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఖరీఫ్‌లో మాదిరి కొనుగోలు చేసిన నిర్ణీత గడువు లోపలే ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాలకు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని ఏడిదలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు.

దిగుబడి ఆశాజనకం



రబీ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ప్రతి గ్రామంలో నాలుగుచోట్ల పంట కోత ప్రయోగాలు చేస్తున్నాం. ఎకరాకు నుంచి 60 బస్తాల దిగుబడి వస్తున్నాయి. ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం.

– కె ఏసుబాబు, మండల వ్యవసాయాధికారి, మండపేట

క్లుప్తంగా

పేదల వైద్యానికి ప్రాధాన్యం


తాతపూడిలో రోగి ఇంటి వద్ద చికిత్స చేస్తున్న డాక్టర్ ప్రియాంక

కపిలేశ్వరపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని తాతపూడి సర్పంచ్ గూటం శ్రావణి, ఎంపీటీసీ సభ్యురాలు జుత్తుక వెంకటలక్ష్మి అన్నారు. తాతపూడిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగర పీహెచ్‌సీ వైద్యురాలు జె.అనూజ ప్రియాంక శిబిరంలో 102 మందికి సేవలందించారు. శిబిరానికి రాలేని రోగులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి చికిత్స అందజేశారు. ప్రతి నెలా 1, 2వ సోమవారాల్లో రామాలయం వద్ద వైద్య శిబిరాలను కొనసాగించనున్నట్టు ప్రియాంక తెలిపారు. శిబిరంలో 104, అంగర పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

మంచి వాక్యం మానవ ప్రగతికి మార్గం

కపిలేశ్వరపురం: బైబిల్‌లో ఉన్న మంచి వాక్యం మానవ ప్రగతికి మార్గమవుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. పడమర ఖండ్రికలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వద్ద పాస్టర్ జి.రూబెన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్రైస్తవ రక్షణ సువార్త సంగీత పండగలకు ఆయన, టీడీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పుత్సల శ్రీనివాస్ అతిథిలుగా హాజరయ్యారు. జేకే క్రిస్టోఫర్, నిస్సి జాన్, లిలియన్ పాడిన పాటలు అలరించాయి. సువార్త సందేశం మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందని ఎడ్వర్డ్ విలియమ్స్ అన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ


కూలీలకు మజ్జిగను అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

రాయవరం: వెదురుపాకలో గురువారం ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం యానిమేటర్ ఎం.శ్రీదేవి సౌజన్యంతో ఏర్పాటు చేసిన మజ్జిగను ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో డి.శ్రీనివాసు, ఏపీవో జె.సుదారాణి చేతుల మీదుగా కూలీలకు అందజేశారు. ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ వేసవిలో ఉపాధి కూలీలు వడదెబ్బ బారిన పడకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాజర్‌హుస్సేన్, సీసీ కొండబాబు, వైఎస్సార్ సీపీ నేత వాసంశెట్టి గోపి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుల వ్యవహారంపై కేసు


మండపేట: ద్వారపూడిలో నకిలీ వైద్యుల వైద్య శిబిరం నిర్వహణపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం ప్రైవేట్ ఏజెన్సీ పేరిట ముగ్గురు వ్యక్తులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందుల పేరిట రోగుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారు. పంచాయతీ సిబ్బందికి అనుమానం వచ్చి మండల వైద్యాధికారి ఎస్.సూర్యనారాయణరెడ్డికి సమాచారం అందించగా ఆయన విచారణ చేసి వారు క్వాలిఫైడ్ వైద్యులు కారని గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ శివకృష్ణ విచారణ చేసి గురువారం ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాక్ ఇన్ లిక్కర్ షాపును తరలించాలి


మద్యం షాపు వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

రామచంద్రపురం: స్థానిక రాజగోపాల్ సెంటర్ సమీపాన ఉన్న వాక్ ఇన్ లిక్కర్ షాపును తరలించాలంటూ స్థానిక మహిళలు గురువారం ఆందోళన చేశారు. ప్రధాన రహదారిలోని ఈ షాపుతో విద్యార్థులకు, మహిళలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, దీనిని వెంటనే ఇక్కడి నుంచి తొలగించాలని సుమారు 50 మంది మహిళలు మద్యం షాపు వద్ద ధర్నా చేశారు. అనంతరం ఎస్సై డి.సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

అంగర పోలీస్ స్టేషన్ తనిఖీ


పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీధర్

కపిలేశ్వరపురం: అంగర పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా స్టేషన్‌ను సందర్శించారు. ఎస్సై జి.చంటి, పోలీసు సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వారితో మండపేట రూరల్ సీఐ శివగణేష్ ఉన్నారు.

దేశ శాంతి కోసం సైకిల్ యాత్ర



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో విజయ్ గోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: భారతదేశం శాంతిగా ఉండాలని కోరుకుంటూ దేశంలోని అన్ని రాష్ట్రాలను చుట్టేస్తున్న వృద్ధుడు గురువారం ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి చేరుకున్నాడు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా సింధనూరు పట్టణం స్వస్థలంగా చెబుతున్న 52 సంవత్సరాల చాత్రాజుల విజయ్ గోపాలకృష్ణ ఇప్పటికే 13 రాష్ట్రాలు చుట్టి వచ్చి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పుణ్యక్షేత్రాలను చేరుకుని దేవాలయాల్లో మత ఘర్షణలు లేకుండా, విద్వేషాలు చెలరేగకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గత ఏడాది మార్చి 11న స్వగ్రామంలో యాత్ర ప్రారంభించగా, ఉదయం పర్యటన మొదలుపెట్టి, మధ్యాహ్నం కాస్త విశ్రాంతి తీసుకుంటూ మళ్లీ ప్రయాణం సాగిస్తున్నానన్నారు. ప్రతీ రాష్ట్రంలోనూ దేవాలయాల్లో వసతి, భోజన సదుపాయాలు కల్పించి సహకరించినట్లు తెలిపారు.

నల్లూరులో 50 మందికి కంటి పరీక్షలు

కపిలేశ్వరపురం: నల్లూరులో గురువారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. నలుగురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు సేవలందించారు.

బీసీ జనగణనపై హర్షం



మంత్రి వేణుకు కృతజ్ఞతలు తెలుపుతున్న పద్మశాలీ, విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: చిరకాల డిమాండుగా ఉన్న బీసీ జనగణనకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీ సంఘాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను ఆయన క్యాంపు కార్యాలయంలో పలు బీసీ సంఘాల నాయకులు మత్స్యకార సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు నేతృత్వంలో గురువారం కలిశారు. మంత్రిని సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, కాజులూరు మండలం పద్మశాలీల సంఘం నాయకులు గుబ్బల ఏసురాజు, కొండేటి శ్రీనివాస్, గంటా మునీశ్వరరావు, మొండి వెంకటేశ్వర్లు, శీలామంతుల అప్పలరాజు, లొల్ల రామలింగేశ్వరరావు తదితరులు మంత్రి వేణుకు ధన్యవాదాలు తెలిపారు. కాజులూరులో శిథిలావస్థకు చేరిన పురాతన రామాలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయిస్తున్నట్టు ఈ సందర్భంగా మంత్రి వేణు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయనను సంఘ పెద్దలు సత్కరించారు. నియోజకవర్గంలోని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు కూడా మంత్రిని కలసి సమగ్ర కులగణనతో బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయం దక్కుతుందని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ కామాక్షీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కొసనా కామేశ్వరరావు, ద్రాక్షారామ సంఘం అధ్యక్షుడు కొసనా భీమశంకరం, కార్యదర్శి దాకోజు శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు కాల్దారి వెంకటేశ్వరరావు, నాయకుడు భరణికల సత్యనారాయణ, కె.గంగవరం మండల అధ్యక్షుడు పుల్లేటికుర్తి గోపాలకృష్ణ, రామచంద్రపురం పట్టణ నాయకులు కొప్పుల సూర్యనారాయణ, దార్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన


బాలుడికి ఆధార్ పత్రాన్ని అందజేస్తున్న డీఎల్‌డీఓ శాంతి, సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి

మండపేట: అర్తమూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని గురువారం గ్రామ సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులతో కలిసి డీఎల్‌డీఓ శాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ మాట్లాడుతూ ఆధార్ సేవల కోసం ఎక్కడికో దూరం వెళ్లాల్సిన పనిలేకుండా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ పీఎస్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గోపాల్, పంచాయతీ కార్యదర్శి భీమేశ్వరి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు

కె.గంగవరం: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్లను కలిగించే వైరస్‌లు నశించి, మొలక పూర్తి స్థాయిలో వస్తుందని ప్రకృతి వ్యవసాయ అధికారి బి.శివాజీ అన్నారు. దంగేరు పంచాయతీ శివారు కూనిమిల్లిపాడులో విత్తనశుద్ధికి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీజామృతం తయారు చేసే విధానంపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుతం వరి సాగు చివరి దశకు చేరుకుందని, తరువాత పంట వేసే ముందు బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన చాలా లాభాలుంటాయని తెలిపారు. మొక్క 40 రోజుల వరకూ తెగుళ్ల నుంచి తట్టుకుంటుందని చెప్పారు. స్వయంగా బీజామృతం తయారు చేసి రైతులకు చూపించి, సబ్సిడీపై అందించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాలు అందిస్తున్న ఫైర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

రామచంద్రపురం: అగ్నిమాపక వారోత్సవాల్లో చివరి రోజైన గురువారం రామచంద్రపురం అగ్నిమాపక కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ వృత్తుల వారిని ఆహ్వానించి, అగ్ని ప్రమాదాల నివారణ, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఫైర్ ఇన్‌స్పెక్టర్ సంసాని నాగేశ్వరరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ డాక్టర్ ఒ.రామకృష్ణ, విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పి.రామకృష్ణారావు, ఉపాధ్యక్షుడు అంపోలు సత్యనారాయణ, కార్యదర్శులు టి.రాఘవరాజు, సీహెచ్ రామ్మూర్తి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిం స్థల వివాదం పరిష్కారం

- ఉనికి కోసం కామన అసత్య ఆరోపణలు
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత రాజుబాబు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజుబాబు

మండపేట: మసీదు కమిటీ పెద్దల కోరిక మేరకు వారికి ఆమోదయోగ్యంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మసీదు స్థల వివాదం పరిష్కారానికి కృషి చేశారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు స్పష్టం చేశారు. కేవలం ఉనికి కోసమే డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన కార్యాలయంలో గురువారం రాజుబాబు మీడియాతో మాట్లాడారు. మసీదు స్థల వివాదం పరిష్కారం గురించి ఎమ్మెల్సీ తోటపై కామన పలు ఆరోపణలు చేయడాన్ని రాజుబాబు ఖండించారు. పెద్దలు, మీడియా సమక్షంలో ముస్లింల కోరిక మేరకు ఎమ్మెల్సీ తోట స్థల యజమానులతో మాట్లాడి మసీదుకు గిఫ్ట్‌గా దారి మార్గం కల్పించారన్నారు. ఈ విషయమై మసీదు కమిటీ పెద్దలు అందరూ ముక్తకంఠంతో ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారన్నారు. స్థల యజమానుల జోలికి వెళ్లవద్దని ఎమ్మెల్సీ తోట తనకు ఫోన్‌చేసి చెప్పినట్టు ఆరోపిస్తున్న కామన అప్పట్లోనే ఈ విషయాన్ని బయటపెట్టి తన చిత్తశుద్ధిని ఎందుకు చాటుకోలేదన్నారు. సమస్య పరిష్కారమయ్యాక ఇప్పుడు ఆరోపణలు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మసీదు స్థల వివాదాన్ని పెద్దది చేసేందుకు కొందరు రాంబంధులా కాసుకున్నారని ఎమ్మెల్సీ తోట చేసిన వ్యాఖ్యలపై ఆ రాబంధులు ఎవరో చెప్పాలని కామన డిమాండ్ చేయడం గుమ్మడికాయల దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్న చందాన ఉందని రాజుబాబు విమర్శించారు. వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ మెండు బాపిరాజు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్ యాప్ వినియోగంపై శిక్షణ

రాయవరం: పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలకు సోషల్ ఆడిట్ యాప్‌పై మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు శుక్రవారం నుంచి ప్రారంభకానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం డీఈవో ఎం.కమలకుమారి పర్యవేక్షణలో ఎంఈవోలు, సెక్టోరియల్ అధికారులు, డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్లకు వెబెక్స్ నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్లు హెచ్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన హెచ్‌ఎంలు ఈ నెల 24వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ పాఠశాల స్థాయి తల్లిదండ్రుల కమిటీలకు సామాజిక తనిఖీ యాప్‌పై శిక్షణనివ్వనున్నారు. పేరెంట్ కమిటీలకు విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర, సహిత విద్యపై అవగాహన, బడి బయట చిన్నారులను పాఠశాలల్లో చేర్పించడం, మనబడి నాడు–నేడు, మధ్యాహ్న భోజన పథకం, స్కూల్ సేఫ్టీపై అవగాహన కల్పించనున్నారు. శుక్రవారం అమలాపురం డివిజన్ పరిధిలో సఖినేటిపల్లి, రామచంద్రపురం డివిజన్ పరిధిలో ఆలమూరు, కొత్తపేట డివిజన్ పరిధిలో ఆత్రేయపురం మండలాల్లో పాఠశాల హెచ్‌ఎంలకు ఒక రోజు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 24న కొత్తపేట డివిజన్‌లో రావులపాలెం, రామచంద్రపురం డివిజన్‌లో మండపేట, అమలాపురం డివిజన్‌లో మలికిపురం, రాజోలు మండలాల్లో హెచ్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. 25న కొత్తపేట, కపిలేశ్వరపురం, మామిడికుదురు, 26న పి.గన్నవరం, కె.గంగవరం, అమలాపురం, 27న అంబాజీపేట, రామచంద్రపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, 28న అయినవిల్లి, రాయవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల్లో పాఠశాలల హెచ్‌ఎంలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణలకు కోర్సు డైరెక్టర్‌గా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి బీవీవీ సుబ్రహ్మణ్యం వ్యవహరిస్తారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎం.కమలకుమారి నేతృత్వంలో రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి షాలెం రాజు, సెక్టోరియల్ అధికారులు ఈ శిక్షణలను పర్యవేక్షిస్తారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’కు అపూర్వ స్పందన

- చైర్‌పర్సన్ దుర్గారాణి


కపిలేశ్వరపురంలో ఇంటింటా పర్యటనలో వైఎస్సార్ సీపీ నాయకులు


మండపేటలో ప్రజాభిప్రాయసేకరణ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు


కూళ్లలో కరపత్రాలు అందిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్

మండపేట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. పట్టణంలోని 22వ వార్డులో కౌన్సిలర్ బొక్కా సరస్వతి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు తదితరులు హాజరయ్యారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. గత టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసం వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ వార్డుల్లో ఎక్కడికక్కడ ప్రజలు ప్రభుత్వానికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారన్నారు. అనంతరం చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు పట్టణంలోని 17వ వార్డులో పర్యటించారు. మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు కొవ్వాడ బేబి, శెట్టి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు పెంకే గంగాధర్, అన్యం ప్రసాద్, పిల్లి శివ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 30వ వార్డుల్లో కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ప్రభుత్వంపై ఆదరణ

కపిలేశ్వరపురం: గ్రామాల్లో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఆదరణ లభిస్తుంది. గత కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజలు జేజేలు పలుకుతున్నారు. కపిలేశ్వరపురం, నిడసనమెట్ట, వాకతిప్ప, నాగులచెరువు, అచ్యుతాపురం, వడ్లమూరు గ్రామాల్లో గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వం నుంచి పేదలకు అందిన లబ్ధిపై అవగాహన కల్పించారు. ప్రజల సమ్మతిపై ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్‌ను అతికించారు. మహిళలు, వృత్తిదారులు, పేద, మధ్య తరగతి ప్రజల నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపట్ల ఆదరణ లభిస్తుందని నాయకులు కట్టా మురళి, శీలం భాస్కరరావు, అరదాని శ్రీదేవి, పీతల బంగారం, చింతా పెద్దకాపు, విజయ్, పిప్పర సంపతరావు అన్నారు.

ఇంటింటా సంక్షేమ సందడి

కె.గంగవరం: ఇంటింటా సంక్షేమ సందడితో మండలంలోని 26 గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు గురువారం జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇంటింటికీ వెళ్లి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రజలకు అందిన సంక్షేమాన్ని వివరించారు. ప్రతి ఇంటికీ వారి అనుమతితో స్టిక్కర్ అతికించి, సర్వే నిర్వహిస్తున్నారు. ఆ ఇంట్లోని వారితో వారి ఫోన్ నుంచే 82960 82960 ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తున్నారు. కూళ్లలో ఎంపీటీసీ సభ్యుడు పిల్లి దుర్గాప్రసాద్ ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జెడ్.మేడపాడులో జగనన్నే మా భవిష్యత్తు

మండపేట: జెడ్ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు, పార్టీ నాయకులు గ్రామంలో పర్యటించి, ప్రభుత్వ పాలనపై అభిప్రాయసేకరణ చేశారు. కన్వీనర్ తీగిరెడ్డి మహేష్, గృహ సారథులు సంగిశెట్టి మురళీ, గండిమేను శ్రీను, ఓ సన్యాసిరావు, కడిమి సుందరబాబు, మదిబోయిన రాంబాబు, రేలంగి మురళీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: లైన్ల మరమ్మతుల కోసం పట్టణంలోని మెయిన్ రోడ్డు, రత్నంపేట, ముచ్చుమిల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, చింతపల్లి సూరన్న నగర్, వీఏస్‌ఎం కళాశాల, ఆర్డీఓ కార్యాలయం తదితర ప్రాంతాల్లో శుక్రవారం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ సూచనల మేరకు ఆయా ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ మేడిశెట్టి వెంకటరమణ గురువారం తెలిపారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ తెలిపారు. గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్‌లో ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయం తెలిపారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. గొర్రిపూడి ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలం బందనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, చేదువాడ, శలపాక, కరప మండలం గొర్రిపూడి, తాళ్లరేవు మండలం ఇంజరం సబ్‌స్టేషన్ పరిధిలోని కోలంక, నామవానిపాలెం, చలివేంద్రపాడు, పాలమూరుపాడు తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు.

మండపేట మండలంలో..

మండపేట: విద్యుత్‌లైన్ల వార్షిక నిర్వహణలో భాగంగా శుక్రవారం మండలంలోని ఇప్పనపాడు, అర్తమూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఏడీఈ జి.తిరులమలరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపిస్తున్నట్టు గురువారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఇఫ్తార్ విందుకు ఎంతో ప్రాధాన్యం


పసలపూడి ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్, ముస్లింలు

రాయవరం: రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందుకు ఎంతో ప్రాధాన్యముందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ తెలిపారు. పసలపూడిలో మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు వెంకటరెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి పద్మావతి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చింతా రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు పోతంశెట్టి సత్తిబాబు, మల్లిడి వీర్రాఘవరెడ్డి(రాఘవ), చింతా సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.